## పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిరక్షిస్తా



హిమపురి కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మే 13: హిమపురి కాలనీ లేఅవుట్‌లో పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటానని డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి హిమపురి కాలనీలో మంగళవారం మార్నింగ్ వాక్ చేపట్టిన ఆయన కాలనీలోని సమస్యలను పరిశీలించారు. కాలనీ లే అవుట్‌లో పాఠశాల కోసం కేటాయించిన ఖాళీ స్థలాన్ని బదిలీ చేయించి ప్రజా అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీ వాసుల అభిప్రాయం మేరకు సదరు స్థలం విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. స్థల వివాదంపై సర్వే చేయించి సదరు నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ చేపట్టడం జరుగుతుందన్నారు. కాలనీలలో జరుగుతున్న నిర్మాణాల విషయంలో బిల్డింగ్ పర్మిషన్ ఇచ్చే సమయంలో కాలనీకి సంబంధించిన లే అవుట్‌ను పరిశీలించి, అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జడిగం రాములు, సముద్రాల బద్రీనాథ్, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

## హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేయాలి



హిందూ శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు

హయత్ నగర్, మే 13 : హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కోరారు. హయత్ నగర్ డివిజన్‌లోని హిందూ శ్మశాన వాటికను మంగళవారం మున్సిపల్ అధికారులుతో కలిసి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంజారా కాలనీలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా గ్రీనరీ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ పరిశీలనలో డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో

# దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, జీఎం ప్రభంజన రావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎన్‌పీఆర్‌డీ నాయకులు

మలక్‌పేట మే 13: రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు కే .వెంకట్, కార్యదర్శి ఎం. అడివయ్య డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో మంగళవారం మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదని భీష్మించుకొని కూర్చోవడంతో, అడిషనల్ డీసీపీ రఘు ఆదేశాల మేరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులతో చాదర్ ఘాట్ సీఐ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ అందుబాటులో లేకపోవడంతో జీఎం ప్రభంజన్ రావ్ వచ్చి వారికి నచ్చజెప్పారు. అందుకు వారు వారి డిమాండ్లకు సంబంధించిన వినతి పత్రాన్ని జీఎంకు అందజేశారు. మీ డిమాండ్లను, సమస్యలను డైరెక్టర్ శైలజ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జీఎం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించి అమలు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని, దివ్యాంగుల సంక్షేమ శాఖలో పదవీ విరమణ పొంది పనిచేస్తున్న వారిని వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. 40 శాతం వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగునికి పరికరాలు ఇవ్వాలని, వైకల్య తీవ్రతను బట్టి మోటరైజ్డ్ వెహికల్స్‌ను ఇవ్వాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా మార్చి అవసరమైన ఉద్యోగులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. చైల్డ్ డెవలప్ మెంట్ సెంటర్స్, స్పీచ్, హియరింగ్ స్పెషల్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చేయాలని, అనుమతి లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.5 లక్షల ప్రోత్సాహకం, జంటలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని వారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ర్యాంపులు నిర్మించాలని, సామూహిక ప్రాంతాలన్నీ దివ్యాంగులు వినియోగించుకునే విధంగా మార్చాలని వారు డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ లలో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో కూడా ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ప్రతి దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డును జారీచేయాలని, దివ్యాంగులపై జరుగుతున్న వేధింపులు, అవమానాలను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు ప్రతి జిల్లా కేంద్రంలో దివ్యాంగుల భవనాన్ని నిర్మించాలని, ప్రభుత్వం నియమిస్తున్న అన్ని రకాల నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించాలని వారు కోరారు. పెండింగ్ లో ఉన్న వివాహ ప్రోత్సాహకాల నిధులను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుతం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని రూ .2 లక్షలకు పెంచాలని వారు కోరారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ అమలు చేసి జిల్లా కేంద్రాల్లో హోమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. టీసీపీసీ కేంద్రాలను పునరుద్ధరణ చేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెన్షన్ రూ.6 వేలకు పెంచి వెంటనే అమలుపరచాలని వారు డిమాండ్ చేశారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.25 వేలు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని, ప్రతి దివ్యాంగుడికి హెల్త్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ను చేయాలని వారు డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్పెషల్ టీచర్స్ నియామకాలు చేపట్టాలని, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని వారు అన్నారు. సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఒక్కరికి రైల్వే రాయితీ కోసం డిజిటల్ కార్డ్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కోశాధికారి ఆర్. వెంకటేష్, సాయమ్మ రాణి, కాశప్ప, మధు బాబు, చందు, భుజంగ రెడ్డి, జయలక్ష్మి, ప్రభు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

### జీ హైస్కూల్

## విజయ పరంపర

వనస్థలిపురం, మే 13: సీబీఎస్ఈ 10, 12 తరగతి ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాలలో జీ హై స్కూల్ సీబీఎస్ఈ 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ బోర్డు పరీక్షల్లో వందశాతం ఫలితాలతో ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా జీ హైస్కూల్ యాజమాన్యం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. 29 మందికి పైగా విద్యార్థులు 90% కంటే ఎక్కువ మార్కులతో డిస్టింక్షన్ సాధించారు. 120 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు.

## గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ కుటుంబానికి ఆర్థిక సాయం




సందీప్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న యాదగిరి యాదవ్, తదితరులు

ఘట్‌కేసర్, మే 13: మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి మృతి చెందిన ఘట్‌కేసర్ పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ కుటుంబానికి జన చైతన్య సేవా సమితి వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో మంగళశారం మృతుడి కు టుంబ సభ్యులకు రూ.50 వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమం లో కంది ప్రేమ్ కుమార్, భుషన్ చారి, శశిధరన్, రవీందర్, ఖయూమ్, సారా శ్రీనివాస్ గౌడ్, శివరాత్రి సురేష్, ప్రసన్న కుమార్, గోపాల్‌గౌడ్,సుబ్బారావు, శివశంకర్, ప్రశాం త్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### రైతులకు మద్దతు ధర, వసతుల కల్పనలో

## ఉద్యోగులు ముందుండాలి: నరసింహారెడ్డి



పదోన్నతి పొందిన అధికారి అశోక్‌ను అభినందిస్తున్న నరసింహారెడ్డి, ముక్రం, దామోదర్, తదితరులు

మలక్‌పేట మే 13: మార్కెట్ యార్డుల్లో రైతులకు మద్దతు ధర, వసతుల కల్పన విషయంలో ఉద్యోగులు ముందుండాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి, కార్యదర్శి మహమ్మద్ ముక్రం సూచించారు. మలక్ పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గ్రేడ్ - 2 కార్యదర్శి నుంచి గ్రేడ్ - 1 కార్యదర్శిగా పదోన్నతి పొందిన అధికారి పి. అశోక్ అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌ను వారు పుష్ప గుచ్చాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మార్కెట్ యార్డుల్లో రైతులు, వ్యాపారులు నష్టపోకుండా రైతులకు మద్దతు ధర కల్పిస్తూనే వ్యాపారులకు కూడా మేలు చేకూరే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ఉద్యోగులు నిరంతరం పాటుపడాలన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరువ చేసి, ప్రజల, ప్రభుత్వ మన్ననలను పొందాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించినప్పుడే ఆ ఉద్యోగానికి తగిన న్యాయం చేయగలుగుతారని వారన్నారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం. దామోదర్, ఉద్యోగులు శ్రీనివాస్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

### వైకుంఠధామంలో

## మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి



శ్మశానవాటికలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట మే 13: మూసారాం బాగ్ డివిజన్లోని వైకుంఠధామం (హిందూ శ్మశాన వాటిక)లో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తెలిపారు. రూ. 90 వేల వ్యయంతో శ్మశాన వాటికలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను మంగళవారం ఆమె దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శ్మశానవాటికలో ఈశాన్యం వైపు వీధి దీపాలు లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని బస్తీ వాసులు తన దృష్టికి తేవడంతో రూ. 90 వేలతో 15 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించడం జరుగుతోందని ఆమె తెలిపారు. అదేవిధంగా డివిజన్‌కు సంబంధించి పెద్ద హిందూ శ్మశాన వాటిక కావటంతో అంత్యక్రియలతో ఎప్పుడు రద్దీగా ఉంటుందని, అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరిన్ని వసతులను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ లైన్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ సురేష్, శ్మశానవాటిక నిర్వాహకులు బల్వంత్, జగన్, బస్తీ వాసులు నరసింహ, శంకర్, మల్లేష్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కమిషనర్‌కు సమ్మె నోటీసు



కమిషనర్‌కు సమ్మెను నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మేడ్చల్, మే 13 : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ నరేశ్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 2వ పీఆర్సీలో కనీస వేతనం రూ.26,000లుగా నిర్ణయించాలని, కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన వేతనాల కోడ్-2019 చట్టం కార్మికవర్గానికి నష్టం అన్నారు. కార్మికుని అవసరాల ప్రాతిపదికన కనీస వేతనాలు నిర్ణయించాలి కానీ అలా కాకుండా ఈ కోడ్ లో దీనిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. రూ.15వేల లోపు వేతనం పొందేవారే సంక్షేమ పథకాలకు అర్హులుగా, ఆపైన వేతనాలు పొందే వారిని అనర్హులుగా నిర్ణయించిందన్నారు. హక్కుల సాధన కోసం చేస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపాలిటీ కార్మిక సంఘం నాయకులు మల్లేష్, మామిండ్ల మల్లేష్, లక్ష్మారెడ్డి, రాజు, స్వామి, సురేష్, రవి, శ్రీనివాస్ రెడ్డి, కొత్తపల్లి రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కందుకూరు, మే 13: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గ్రామస్తులు పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మంద రాములు(49) ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి సాయంత్రం అయినా కానీ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా పక్కనే ఉన్న మంద యాదయ్య పొలంలో పశువులకు గడ్డి కోస్తున్న రాములుకు విద్యుత్ మోటారు వైర్ తగిలి మృతి చెంది ఉన్నాడు. రాములు కుమారుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ...



రాజు( ఫైల్)

కందుకూరు, మే 13: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన పోల్ దాస్ రాజు (40)సోమవారం రాత్రి కందుకూర్ ఎక్స్ రోడ్ నుండి గూడూరు సొంత గ్రామానికి బైక్ పై వెళ్తుండగా ఎస్ హోటల్ దాటిన తర్వాత గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై రాజు పడి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఉప్పల్, మే 13 : నాచారం ఓల్డ్ విలేజ్లో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ పర్యవేక్షించారు. నాచారం ఓల్డ్ విలేజ్లో గతంలో రూ.54 లక్షలతో రోడ్లు వేయడం జరిగిందని, మిగిలిన రోడ్లకు రూ.50 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించామనారు. కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సాయి జన్ శేఖర్, భూపాల్ రెడ్డి, బుచ్చన్న గౌడ్, విటల్ యాదవ్, రామకృష్ణ గౌడ్, బి.కృష్ణ, వెంకటేష్, ఏఈ వినీత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉద్యోగ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

### ఎమ్మెల్యే బలాల




ఉద్యోగ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, మే 13: పాతబస్తీ యువతలో వృత్తి నైపుణ్యం పెంపొందించడం కోసం మలక్‌పేటలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. అక్బర్ బాగ్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ మెస్‌లో మంగళవారం మలక్ పేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నిర్వహించిన 'గ్రాండ్ జాబ్ ఫెయిర్- 2025'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారికి జీవనోపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుత పోటీ తరుణంలో యువత చదువుతోపాటు ఉద్యోగ, వృత్తి నైపుణ్య ప్రమాణాలను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకోసం ఉద్యోగ నైపుణ్యం పెంచుకోవడానికి స్థానికంగా స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేసే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఉద్యోగ మేళా ద్వారా జీవనోపాధి పొందడం కోసం ఉద్యోగ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్‌ను ట్రైనింగ్ ఆఫీసర్ సతీష్ రెడ్డి, ఎమ్ఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ దశరథ్, టాంకో ప్రతినిధి శష్మా మాట్లాడుతూ, విద్యా, నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఇబ్నాట్ ఫౌండేషన్ సహకారంతో మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ (ఎన్ఎస్‌బీఐ), టెలికాం (ఎంప్లాయిమెంట్ ఇన్ అబ్రాడ్)తో సహా 50 ప్రైవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, బీఈ, బీటెక్ పూర్తిచేసిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన అనేకమందికి ఉపాధి అవకాశాలను కల్పించారు. కొత్త వారికి, అనుభవం కలిగిన ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్ సేల్స్ ,డిజిటల్ మార్కెటింగ్ రంగాలకు సంబంధించిన ఉద్యోగాలు కల్పించి వాటికి సంబంధించిన నియామక పత్రాలను నిర్వాహకులు అభ్యర్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు, కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించండి



హరిపురి కాలనీ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

ఆర్కే పురం, మే 13: ఆర్కేపురం డివిజన్ హరిపురికాలనీలో మ్యాన్‌హోల్ అధ్వానంగా మారి ప్రమాదంగా మారింది. మ్యాన్ హోల్ రోడ్డు లోపలికి కూరుకుపోయినా జల మండల అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్‌హోల్ నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతోనే ఈ దుస్థితికి కారణమని పేర్కొంటున్నారు. దీంతో రాత్రి వేళలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు మ్యాన్ హోల్ చుట్టూ చెట్ల కొమ్మ =లను అడ్డుగా పెట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

## కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించాలి

మల్కాజిగిరి,మే13: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మల్కాజిగిరి చౌరస్తాలో ఈనెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మె పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నర్సింగరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ. హేమలత, వసంత ,చంద్రకాంత, శశికళ, స్వప్న, నమ్ర తా, అర్చన, సునీత, లలిత, శైలజ, భవాని, మంగ, మమత, రాజ్యలక్ష్మి, శిరీష, సుజాత, రేణుక, సుగుణ, శాంతకుమారి, రోహిణి, కవి త, త్రిసింధు, లక్ష్మణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ కేంద్రంలో అధిక రుసుం వసూలు

ఉప్పల్ , మే 13:ఉప్పల్ నియోజకవర్గంలో జై గణేశ్ మీ సేవా కేంద్రం వద్ద ప్రజల నుంచి అధిక రుసుంలు వసూలు చేస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మసీ దు వద్ద ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రంలో రేషన్ కార్డులో పేరు నమోదు లేదా తొలగింపు కోసం వెళ్లిన వారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ సేవకు కేవలం రూ.45 మాత్ర మే చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కేంద్ర సిబ్బంది అదనంగా రూ. 55 వసూలు చేస్తూ అడిగితే దురుసుగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవ్యవహారంపై సం బంధిత అధికారుల దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు బాధిత ప్రజలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు ఫిర్యాదులు పరిశీలించి తక్షణ చర్యలు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.

# 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

### సీఐటీయూ




చైతన్యపురిలో సీఐటీయూ అధ్వర్యంలో జరిగిన మున్సిపల్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్ర మోహన్

ఎల్బీనగర్, మే 13: కేంద్ర బీజేపీ ప్రభుత్వం పదకొండు ఏళ్లగా కార్మిక, ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నదని సీఐటీయూ నాయకులు విమర్శించారు.

సరూర్ నగర్ సర్కిల్ చైతన్యపురి డివిజన్లోని కామ్రేడ్ బోడపూడి వెంకటేశ్వర స్మారక కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కార్మికులు సమావేశం జరిగింది. సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఎం. చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం పదకొండు ఏళ్లగా కార్మిక, ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. జాతీయ సహజ వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తున్నదని, డీజిల్, పెట్రోల్ , వంట గ్యాస్, ఇతర నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజలపై పెను భారాలు మోపుతున్నదని విమర్శించారు. . కార్మిక, ప్రజా ఉద్యమాలపై ఉక్కు పాదం మోపి, పౌరులు ప్రాథమిక హక్కులకు సైతం కేంద్రమే పాత్రరేస్తున్నదన్నారు. ఉపాధి, నిరుద్యోగ, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను మరింత త్రీవరూపం దాల్చ యన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్టర్స్ కార్మికులకు వేతనాలు పర్మినెంట్ చేసి రూ. 26 వేలు చెల్లించాలని, జీహెచ్ఎంసీ కార్మికులకు అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల ఔట్సోర్సింగ్ సిబ్బందిని హైకోర్టు ప్రకారంగా పర్మినెంట్ చేయాలన్నారు. అనారోగ్యానికి గురై చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని, మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మికులకు అందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ సీఐటీయూ నాయకులు కృష్ణయ్య, సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ నాయకులు రాములు మల్లేష్, మున్సిపల్ కార్మికులు పద్మ నవనీత, గీత, అరుణ, సరస్వతి, సంతోష, యాదమ్మ పాల్గొన్నారు.

## డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

### డిప్లొమా ఇన్ రేడియాలాజికల్

## ఫిజిక్స్ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియాలాజికల్ ఫిజిక్స్ పరీక్షలను వాయిదా వేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, వివిధ కారణాల రీత్యా వాటిని వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల రెండో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇతర వివరాలు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, మే 13: పోస్ట్ ఆఫీస్, హైకోర్టు కాలనీ, శివ పార్వతి, విష్ణు థియేటర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పోస్ట్ ఆఫీస్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు సరూర్‌నగర్, లింగోజిగూడ, ఓల్డ్ సరూర్‌నగర్, బాలాజీ కాలనీ, కామేశ్వర రావు కాలనీ, శ్రీనివాస కాలనీ పరిసర ప్రాంతాలు. హైకోర్టు కాలనీ ఫీడర్ పరిధిలో సాయి నగర్, సుష్మ సాయి నగర్, ద్వారకా నగర్ పరిసర ప్రాంతాలు. శివ పార్వతి ఫీడర్ పరిధిలో తెలంగాణ నగర్, కూడా లేఅవుట్, హనుమాన్ నగర్, కుంట్లూరు వీకర్ సెక్షన్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, స్వాతి రెడ్డి కాలనీ పరిసర ప్రాంతాలు. విష్ణు థియేటర్ ఫీడర్ పరిధిలో చంద్రపురి కాలనీ, పరిసర ప్రాంతాలు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.